# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 07-06-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1) యోగా కు ప్రపంచవ్యాప్త గుర్తింపు పొందేలా చేసిన ఘనత ప్రధాన మంత్రి నరేంద్రమోదీకే దక్కుతుందని హోం మంత్రి అనిత పేర్కొన్నారు.**

**2) పాఠశాలల్లో విద్యా ప్రమాణాల మెరుగుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని మహిళా, శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు.**

**3) ఫార్మా ఉత్పత్తుల ఎగుమతుల కేంద్రంగా విశాఖ ను అభివృద్ధి చేయటమే ప్రభుత్వ లక్ష్యమని విద్యా ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.**

**4) రాష్ట్రంలో టెక్స్‌టైల్ రంగం అభివృద్ధికి ఎన్డీయే ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చెప్పారు.**

==========================

భారతీయ సంస్కృతిలో వేల ఏళ్లుగా భాగమైన యోగాకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు లభించేలా చేసిన ఘనత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకే దక్కుతుందని హోం శాఖ మంత్రి అనిత అన్నారు. విజయవాడ లో ఎన్‌టిఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో ఈరోజు నిర్వహించిన థీమ్ యోగా కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం, ప్రతి ఇంటికి యోగాను చేరవేయడం, ప్రజల్లో నిత్య యోగా సాధన అలవాటును పెంపొందించే లక్ష్యంతో యోగాంధ్ర కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈరోజు నుంచి 14 రోజులపాటు యోగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని హోం మంత్రి అనిత వివరిస్తూ ...

వాయిస్...30 సెకన్లు

మనిషికి శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యమూ ముఖ్యమని.. నేర నియంత్రణకు, నేర రహిత జిల్లాగా ఎన్‌టీఆర్ జిల్లాను తీర్చిదిద్దేందుకు యోగా కూడా ఓ మంచి మార్గమని యోగా కార్యక్రమంలో పాల్గొన్న పోలీస్ కమిషనర్ ఎస్‌వీ రాజశేఖరబాబు అన్నారు.

--------------------------

కృష్ణాజిల్లా మచిలీపట్నం మంగినపూడి బీచ్‌లో జరిగిన స్వర్ణాంధ్ర యోగాంధ్ర కార్యక్రమంలో రాష్ట్ర గనుల

శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకల్ల నారాయణరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ యోగాను ప్రతి మనిషి ఒక్కరోజు కార్యక్రమంగా కాకుండా దైనందిన ప్రక్రియగా నిర్వహించాలని అన్నారు.

-----------------------------

అడవులు, ఆదివాసీ సమాజాల సంక్షేమమే యోగాంధ్ర లక్ష్యం అని పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ అన్నారు. రంప చోడవరం ఐటీడీఏ కార్యాలయంలో ఈరోజు జరిగిన యోగాంధ్ర కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ .... పోలవరం జిల్లాకు రాష్ట్ర ప్రభుత్వం "అడవులు, ఆదివాసీ సమాజాలు మరియు సంక్షేమం కోసం యోగా" అనే ప్రత్యేక థీమ్‌ను కేటాయించిన నేపథ్యంలో, గిరిజన ప్రాంతాల్లో యోగా సాధనపై అవగాహన పెంపొందించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు పేర్కొన్నారు.

తిరుపతి ఎస్వీ జూ పార్కులో ఏర్పాటుచేసిన యోగాంధ్ర కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ గోవిందరావు. స్థానిక ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు యోగాసనాలు వేశారు.

-----------------------------

ఆకాశవాణి 90 ఏళ్ల ప్రయాణాన్ని పూర్తి చేసుకుంటున్న సందర్భాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్ శుభాకాంక్షలు తెలిపారు. భారత ప్రజా ప్రసార ప్రయాణంలో ఆకాశవాణి 90 ఏళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకోవడం చారిత్రాత్మకమన్నారు. "బహుజన హితాయ బహుజన సుఖాయ" అనే నినాదంతో ఈ ప్రయాణాన్ని మరింత ఉత్సాహంగా కొనసాగించాలని గవర్నర్ జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్ అభినందనలు తెలుపుతూ ...

...వాయిస్..25 సెకన్లు

-----------------------------

పాఠశాలల్లో విద్యా ప్రమాణాల మెరుగుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పేర్కొన్నారు పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న మెగా డీఎస్సీ నూతన ఉపాధ్యాయుల శిక్షణ తరగతులను మంత్రి ఈరోజు పరిశీలించారు. శిక్షణలో ఉన్న ఉపాధ్యాయులతో మాట్లాడి ... వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన విద్య అందించడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని మంత్రి స్పష్టం చేశారు. ద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేనని, దానిని సమర్థవంతంగా నిర్వర్తించాల్సిన అవసరం ఉందని మంత్రి సూచించారు.

-----------------------------

విశాఖపట్నంలో నిర్మాణంలో ఉన్న ఆర్ఎంఎం ఫార్మా యూనిట్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని విద్యా ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ఆ సంస్థ డైరెక్టర్ ముఖేష్ కుమార్ ను కోరారు. రష్యా పర్యటనలో భాగంగా మాస్కోలో సంస్థ డైరెక్టర్ తో ఆయన నిన్న సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రష్యా, తదితర దేశాల మార్కెట్లకు ఫార్మా ఉత్పత్తుల ఎగుమతుల కేంద్రంగా విశాఖపట్నాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యమని తెలిపారు. 200 కోట్ల రూపాయల పెట్టుబడితో నిర్మిస్తున్న విశాఖ యూనిట్ తో 300 మందికి ఉపాధి లభించనుందని సంస్థ డైరెక్టర్ మంత్రికి వివరించారు. ఈ యూనిట్ లో ఇంజెక్టబుల్స్, టాబ్లెట్లు, క్యాప్సూల్స్ తయారీ చేపట్టనున్నట్లు

వెల్లడించారు. వచ్చే మార్చి నాటికి ఉత్పత్తిని ప్రారంభిస్తామని తెలిపారు.

---------------------------

రాష్ట్రంలో టెక్స్ టైల్ రంగం అభివృద్ధికి ఎన్డీయే ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చెప్పారు. ఆయన నిన్న గుంటూరులో జరిగిన ఏపీ టెక్స్ టైల్స్ మిల్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చీరాల–గుంటూరు ప్రాంత టెక్స్ టైల్ పరిశ్రమలు ఎదుర్కొంటున్న సమస్యలను ఇప్పటికే కేంద్ర టెక్స్ టైల్ శాఖ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. రాష్ట్రంలో వస్త్ర పరిశ్రమ అభవృద్ధికి తన వంతు సహాయం అందిస్తానని డాక్టర్ చంద్ర శేఖర్ వివరిస్తూ .......

వాయిస్...30 సెకన్లు

---------------------------

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రేపు పశ్చిమగోదావరి జిల్లా సిద్దాంతంలో పర్యటించనున్నారు. ఉదయం 11 గంటలకు సిద్దాంతంలో జరిగే గ్రామ సభలో రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ చేస్తారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడతారు. మద్యాహ్నం 3 గంటలకు రైతులతో సమావేశం అవుతారు. ఆ కార్యక్రమం అనంతరం పార్టీ కార్యకర్తలతో సమావేశం అవుతారు.

కాగా... జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో రేపు కలెక్టరేట్‌లో నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదికను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి చెప్పారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి సంబంధిత కార్యాలయాలకు అర్జీల సమర్పణ కోసం రావద్దని, తదుపరి సోమవారం ఈ కార్యక్రమం నిర్వహించబడుతుందని తెలిపారు.

---------------------------

చిత్తూరు జిల్లాలో జలధార–జలహారతి కార్యక్రమం కింద చేపట్టిన పనులు పురోగతితో కొనసాగుతున్నాయని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. రాష్ట్ర గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్ నిన్న నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జిల్లాలో చేపట్టిన పనుల పురోగతిని వివరించారు. కాలువల పూడికతీత, అనుసంధాన కాలువల అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తూ, చెరువుల శ్రేణుల ఆధారంగా పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. జలధార–జలహారతి కార్యక్రమం కింద చేపడుతున్న అన్ని పనుల పురోగతిని యాప్ ద్వారా నమోదు చేసి పారదర్శకంగా పర్యవేక్షిస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు.

---------------------------

వచ్చే నెల 9,10 తేదీల్లో విశాఖపట్నంలో వరల్డ్ ఫుడ్ ఫెస్టివల్ నిర్వహిస్తామని ఏలూరు జిల్లా ఉద్యాన అధికారి కె.సాజా నాయక్ తెలిపారు. కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రిత్వ శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సౌజన్యంతో ఆంధ్ర విశ్వ విద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలో దీన్ని నిర్వహిస్తున్నట్లు నిన్న ఒక ప్రకటనలో తెలిపారు.

====================